సాక్షి చిత్తూరు

గురువారం । 9 । ఫిబ్రవరి । 2023



చిత్తూరు బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.54,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,150

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.70,000
రిటైల్ వెండి గ్రాము	రూ.72

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	33	17
తిరుపతి	34	18
తిరుమల	29	14
గూడూరు	34	19
నగరి	34	18

శివలింగంపై సూర్య కిరణాలు



రొంపిచెర్ల: మండలంలోని బొమ్మయ్యగారిపల్లె శివాలయంలోని శివలింగాన్ని బుధవారం ఉదయం సూర్యకిరణాలు తాకాయి. ప్రతి ఏడాది మహా శివరాత్రి వచ్చే నెలలో సూర్యకిరణాలు శివలింగాన్ని తాకుతాయని ఆలయ పూజారి మునిరాజశర్మ తెలిపారు.

న్యూస్‌రీల్

ఆహార భద్రత చట్టంపై అవగాహన అవసరం



రాగిజావను పరిశీలిస్తున్న విజయ ప్రతాప్‌రెడ్డి

సదుం: ఆహార భద్రత చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర ఆ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం మండల కేంద్రంలో పర్యటించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, రేషన్‌షాపు, బీసీ గురుకుల బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేశారు. పిల్లలు చక్కగా పద్యాలు చెప్పడంతో వారికి చాక్లెట్లు అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఫ్యాను ఏర్పాటుకు రూ.2 వేలు అందజేశారు. పిల్లలకు అందించే రాగి జావ తయారీని పరిశీలించారు. ఫుడ్ కమిషన్ డీడీ సురేష్, డీఎస్‌ఓ శంకర్, సాంఘిక సంక్షేమాధికారి రాజ్యలక్ష్మి, బీసీ సంక్షేమాధికారి రబ్బానీ బాషా, శిశు సంక్షేమాధికారి నాగశైలజ పాల్గొన్నారు.

హాస్టల్ భోజనం రుచికరం

పూతలపట్టు: ప్రభుత్వ వసతి గృహ భోజనం రుచికరంగా ఉందని రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ విజయ్‌ప్రతాప్‌రెడ్డి ప్రశంసించారు. ఆయన బుధవారం మండలంలో పర్యటించారు. బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేసి నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని పిల్లలకు అందిస్తున్నారని సిబ్బందిని అభినందించారు. రేషన్‌గోదామును పరిశీలించి భవన నిర్మాణానికి అవసరమైన రెండు ఎకరాల భూమిని కేటాయించాలని తహసీల్దార్‌కు సూచించారు. పి.కొత్తకోటలోని గురుకుల పాఠశాలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రాజ్యలక్ష్మి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారిణి నాగశైలజ, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సతీష్, రాముడు, తహసీల్దార్ విజయభాస్కర్, ఎంపీడీఓ గౌరి, వసతి గృహ అధికారి జయచంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కాసులు ఇస్తే రికార్డులను తారుమారు చేసి ఏ భూమినైనా రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చేస్తారనేందుకు తిరుపతిలో వెలుగుచూసిన ఉదంతమే నిదర్శనం. రూ.కోట్ల విలువచేసే భూమికి సంబంధించిన రికార్డుల్లోని రెండు పేజీలు మాయమై.. వాటి స్థానంలో కొత్తగా రెండు పేజీలు వచ్చాయి. ఈ పేజీల చించివేత వెనుక ఓ టీడీపీ నాయకుడి హస్తం ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ వ్యవహారం వెలుగులోకి రావడంతో ఉన్నతాధికారులు విచారణకు దిగారు.



ఆ రెండు పేజీలు ఏమయ్యాయ్..?

- తిరుపతి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతిపరులు
- 1972 డాక్యుమెంట్‌లోని రెండు పేజీలను చించేసి..
- కొత్తగా మరో రెండు పేజీలను అతికించిన వైనం
- రూ.కోట్లు విలువైన భూమికి దొంగ రికార్డులు
- పేపర్ల చించివేత వెనుక ఓ టీడీపీ నేత హస్తం?
- విచారణకు దిగిన అధికారులు
- అధికారులపై వేటు తప్పదా?

సాక్షి టాస్క్‌ఫోర్స్ : తిరుపతి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోని కొందరు అధికారుల అవినీతి సినిమా విలన్ల స్కెచ్‌లను మించుతోంది. ఏకంగా రికార్డుల్లోని ఒరిజినల్ పేజీలను చించేసి కొత్త పేపర్లను అతికించి రూ.కోట్ల భూములను తారుమారు చేసేశారు. సిబ్బంది కథనం మేరకు... తిరుపతి నగరంలో రూ.కోట్ల విలువైన భూమికి సంబంధించి ఇరు వర్గాల మధ్య వివాదం నడుస్తోంది. ఈ వివాదానికి ముఖ్యమైన ఆధారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోని 1972 నాటి రికార్డు. ఆ భూమిని కొట్టేసేందుకు ప్రయత్నాలు చేస్తున్న వ్యక్తి ఈ విషయాన్ని గ్రహించాడు. ఓ టీడీపీ నేత సహకారంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తనకు తెలిసిన సిబ్బంది ద్వారా రికార్డులను తారుమారు చేసినట్లు చర్చ సాగుతోంది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోని 1972 నాటి 886 నంబర్ రికార్డులను బయటకు తీసి విలువైన భూమికి సంబంధించిన రెండు పేజీలను చించి వేసినట్లు అధికారులు గుర్తించారు. ఆ రెండు పేజీల స్థానంలో కొత్త పేజీలను అంతికించారు.

బాధితుల ఫిర్యాదుతో వెలుగులోకి...

తన భూమికి సంబంధించిన రికార్డుల కోసం బాధితులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులను ఆశ్రయించారు. ఆ రికార్డును పరిశీలించగా.. రెండు పేజీలను చించివేసి కొత్తగా మరో రెండు పేజీలను అతికించినట్లు బయటపడింది. ఆ పేజీల్లో సదరు భూమిని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్న మరో వర్గానికి చెందిన వారి పేర్లను కూడా చేర్చారు. వారు ఆ భూమిని కొనుగోలు చేసినట్లు రికార్డును తారుమారు చేశారు. ఈ విషయంపై బాధితులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

ఎలా బయటకు తీసుకెళ్లారు?

రెండు పేజీలను చించేశారంటున్న ఆ పుస్తకాన్ని బయట బైండింగ్ వర్క్ చేసే వారి వద్దకు తీసుకెళ్లినట్లు అనుమానిస్తున్నారు. ఇందులో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పని చేసే కొందరు అధికారుల ప్రమేయం లేకుండా బయటకు తీసుకెళ్లలేరని చర్చ జరుగుతోంది. ఆ రికార్డుల పుస్తకం సుమారు 3 అడుగుల పొడవు, ఒకటిన్నర అడుగు వెడల్పు 5 కిలోల బరువు ఉంటుందని అధికారులు చెబుతున్నారు. బాధితుల ఫిర్యాదు అనంతరం అతికించిన పేజీలను నిఘా అధికారులు పరిశీలించినట్లు తెలిసింది. పుస్తకంలో ఆ రెండు పేజీలు మాత్రం తాజా కాగితం రంగు ఉన్నట్లు గుర్తించారు. పక్క పేజీల రంగు, ఈ పేజీల రంగు తేడా గమనించారు. పేజీలు చించకుండా ఉంటే.. ఆ పేజీలపై సీరియల్ నంబర్ ఉండాలని, అయితే ఆ నంబర్లు లేవని చెబుతున్నారు. అదే విధంగా పక్క పేజీల్లోని రాతకు, అతికించిన పేజీల్లోని రాతకు తేడా ఉన్నటు గుర్తించి, నిర్ధారణకు వచ్చినట్లు విశ్వసనీయ సమాచారం.

మరిన్ని అక్రమాలు వెలుగులోకి?

రెండు పేజీలను చించివేసిన ఘటన వెలుగులోకి వస్తే మరిన్ని అక్రమాలు బయటపడే అవకాశం ఉన్నట్లు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోని సిబ్బంది చర్చించుకుంటున్నారు. పేజీలను చించివేసిన విషయం తెలుసుకున్న కొందరు స్థానికులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చి తమ భూమి వివరాలు కావాలని అడుగుతున్నట్లు తెలిసింది. తిరుచానూరు–రేణిగుంట మార్గంలో 30 సెంట్ల విస్తీర్ణాన్ని 3.30 ఎకరాలుగా రికార్డులో మార్చినట్లు తిరుపతికి చెందిన వెంకటరెడ్డి అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఉన్నతాధికారులు విచారణ చేసి అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

> **విచారణ చేస్తున్నాం**
>
> రికార్డులో పేపర్ మిస్సింగ్‌పై విచారణ జరుగుతోంది. సంబంధిత అధికారులు, ఉద్యోగులకు నోటీసులు కూడా ఇచ్చాం. త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తాం. తప్పు జరిగిందని తేలితే సంబంధించిన వారిపై శాఖాపరమైన చర్యలు ఉంటాయి.
>
> – గిరిబాబు, డీఐజీ, ఉమ్మడి చిత్తూరు జిల్లా

ట్యాబ్‌ల వినియోగంపై శిక్షణ



ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్న డీఈవో

చిత్తూరు కలెక్టరేట్: ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు అందజేసిన ట్యాబ్స్ ఎంతో ఉపయోగకరమని డీఈవో విజయేంద్రరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరింపేట మున్సిపల్ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు, టీచర్లకు ట్యాబ్‌ల వినియోగంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డీఈవో మాట్లాడుతూ పోటీ ప్రపంచానికి తగినట్లుగా సర్కారు బడుల్లో చదువుతున్న విద్యార్థులు సాంకేతిక విద్యలో పట్టు సాధించాలని పిలుపునిచ్చారు. అందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ట్యాబ్‌లను ఉచితంగా పంపిణీ చేసిందన్నారు. ట్యాబ్‌లలో బైజూస్ కంటెంట్ బాగా ఉపయోగపడుతుందని చెప్పారు. బైజూస్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు ఎన్ని నిమిషాలు ట్యాబ్‌లను వినియోగించారన్నది తెలుసుకోవచ్చన్నారు. ఉపాధ్యాయులు బాధ్యతగా ట్యాబ్‌ల వినియోగాన్ని పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు, టీచర్ల సందేహాలను నివృత్తి చేశారు. తెలుగు, హిందీ టీచర్లకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఏఎస్‌వో ఆనంద్, బైజూస్ కంటెంట్ జిల్లా కో–ఆర్డినేటర్ తులసి, గిరింపేట మున్సిపల్ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శిక్షణలోని అంశాలు ఇవే..

- ట్యాబ్‌లలో కంటెంట్ మారుతూ ఉంటుంది.
- సబ్జెక్టు, జనరల్ నాలెడ్జ్, ప్రాక్టీస్ పరీక్షలు మాత్ర మే ఉంటాయి. ఇతర ఎలాంటి సైట్లూ ఓపెన్ కావు.
- ఏ విద్యార్థి దగ్గర ఏ ట్యాబ్ ఉందో తెలుసుకునే వెసులుబాటు ఉంది.
- విద్యార్థులు ఎస్‌డీ కార్డులను ట్యాబ్‌ల నుంచి బయటకు తీయడం, రీసెట్ చేయడం వంటివి నిషేధం.

బోయకొండలో లక్ష కుంకుమార్చన



లక్ష కుంకుమార్చనలో ఉభయదారులు

చౌడేపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయంలో ఏటా మాఘమాసంలో నిర్వహించే లక్ష కుంకుమార్చన ప్రారంభమైంది. బోయకొండ ఆలయంలో 15 ఏళ్లుగా, మాఘమాసంలో లక్ష కుంకుమార్చనను నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే వేద పండితులు, అర్చకులు బుధవారం అమ్మవారి ఉత్సవమూర్తికి ఆలయ కమిటీ చైర్మన్ మిద్దింటి శంకర్‌నారాయణ, ఈఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో లక్ష కుంకుమార్చన ప్రారంభించారు. మూడు రోజుల పాటు సాగే కుంకుమార్చనలో గణపతి హోమం, చండీహోమం, మహా మంగళహారతి నిర్వహించారు. రూ.1,116 చెల్లించిన 125 జంటలు ఉభయదారుల హోదాలో హాజరయ్యాయి. భక్తులతో బోయకొండ ఆలయం కిటకిటలాడింది. ఉభయదారులకు అమ్మవారి వెండి నాణెంతోపాటు శేషవస్త్రం, తీర్థప్రసాదాలను దంపతులకు అందజేశారు. పాలక మండలి సభ్యులు వెంకటరమణారెడ్డి, పూర్ణిమ, శ్రావణి తదితరులున్నారు.

అధునాతనం.. లెక్కింపు సులభతరం

- తిరుమలలో ప్రారంభమైన నూతన పరకామణి భవనం
- రూ. 23 కోట్లతో ఆధునిక భవంతి
- ఇక్కడే డోనర్ సెల్ ఏర్పాటుకు చర్యలు
- జర్మనీ నుంచి యంత్రాలు రాగానే నాణేల లెక్కింపు కూడా..

తిరుమల: తిరుమలలో పుష్కరిణికి ఎదురుగా టీటీడీ నిర్మించిన పరకామణి భవనంలో ఆదివారం నుంచి కానుకల లెక్కింపు ప్రారంభమైంది. బెంగళూరుకు చెందిన దాత మురళీకృష్ణ అందించిన రూ.23 కోట్ల విరాళంతో అధునాతన సౌకర్యాలతో కూడిన పరకామణి భవనాన్ని నిర్మించారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా 2022 సెప్టెంబరు 28న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లాంఛనంగా ఈ భవనాన్ని ప్రారంభించారు. హుండీ ఆదాయం సరాసరి రోజుకు రూ.3 కోట్లు వస్తుండడంతో లెక్కింపునకు సిబ్బంది, స్థలం కొరత ఉంటోంది. ఒక దశలో ప్రత్యేకంగా సిబ్బందిని నియమించి రాత్రి వేళల్లో కూడా లెక్కింపు చేపట్టేవారు. నిత్యం 250 మంది వరకు పరకామణి మండపానికి వెళ్లాల్సి ఉండడం.. అక్కడ స్థల లభ్యత తక్కువగా ఉండడం..క్లోజ్‌డ్ సర్క్యూట్ ఉండే ఈ ప్రదేశంలో విధులు నిర్వహించే సిబ్బందికి ఆరోగ్య సమస్యలు తలెత్తుతుండడంతో డెప్యూటేషన్‌పై పరకామణి విధులకు వచ్చేందుకు టీటీడీ ఉద్యోగులు వెనకడుగు వేసేవారు. కానుకల లెక్కింపు పూర్తి స్థాయిలో జరగకపోవడం.. నిత్యం 300 వరకు చిల్లర నాణేల మూటలను తరలించడం వంటివి ఇబ్బందికరంగా మారడంతో అన్ని వసతులతో కూడిన పరకామణి మండపాన్ని నిర్మించాలని మూడేళ్ల కిందట టీటీడీ నిర్ణయించింది. అందుకు అనుగుణంగా రూ.9 కోట్లతో నూతన మండపాన్ని నిర్మించేందుకు 2020 ఆగస్టులో శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించింది. ఈ భవనానికి ఖర్చు పెట్టిన రూ.23 కోట్లు బెంగళూరుకు చెందిన మురళీకృష్ణ విరాళంగా అందించారు.

ఇప్పటి వరకు..

శ్రీవారి ఆలయంలోని ఆనంద నిలయానికి వెనుక ఉన్న మండపంలో కానుకలు లెక్కిస్తున్నారు. 153 అడుగులు ఉండే ఈ మండపంలో నోట్ల పరకామణి చేపట్టేవారు. నాణేలను ఆలయానికి ఆగ్నేయ దిశగా ఉన్న 80 అడుగుల పొడవు, 36 అడుగులు ఉండే కల్యాణ మండపంలో లెక్కిస్తున్నారు. క్రీశ 1586 విజయనగర సామ్రాజ్య ప్రతినిధి చెన్నప్ప నిర్మించిన ఈ మండపంలోనే నాణేలను లెక్కిస్తున్నారు.



శ్రీవారి హుండీని తరలిస్తున్న సిబ్బంది

నేడు అధునాతనం..

కొత్త పరకామణి భవనాన్ని 15 వేల అడుగుల విస్తీర్ణంలో నిర్మించారు. కానుకలకు సంబంధించిన అన్ని కేంద్రాలను ఇక్కడే ఏర్పాటు చేశారు. నోట్లతో పాటు బంగారం, వెండి, ఇతర వస్తువుల లెక్కింపు మొత్తం కూడా ఈ భవనంలోనే జరుగనుంది. ఇకపై ఏ రోజు కానుకలు ఆరోజు లెక్కించే వెసులుబాటు లభించనుంది. డోనర్ సెల్‌ను ఇదే మండపంలో ఏర్పాటు చేయనున్నారు. కానుకల లెక్కింపును భక్తులు ప్రత్యక్షంగా వీక్షించే వెసులుబాటు కల్పించారు.

త్వరలోనే చిల్లర నాణేల లెక్కింపు

చిల్లర నాణేల లెక్కింపునకు సంబంధించి నూతన యంత్రాలు ఇంకా రాకపోవడంతో.. ప్రస్తుతానికి తిరుపతిలోని పరకామణి మండపంలోనే కొనసాగించనున్నారు. జర్మనీ నుంచి నూతన యంత్రాలు తిరుమలకు చేరుకోగానే చిల్లర నాణేల లెక్కింపును కొత్త భవనంలో చేపడుతారు.

యూనియన్ల మద్దతూ లేని, సభ్యత్వం కానీ లేని అసంఘటిత రంగ కార్మికులకు లబ్ధి చేకూర్చేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకొచ్చింది. వారికి ప్రమాద, జీవిత బీమా కల్పించేందుకు అవసరమైన నియమ నిబంధనలతో ఈ–శ్రమ్ పోర్టల్ రూపొందించింది. అందులో నమోదు చేసుకున్న కార్మికులకు ప్రభుత్వం ద్వారా సామాజిక భద్రత, పథకాలను అందించేందుకు చర్యలు చేపట్టింది.



భవన నిర్మాణ కార్మికులు

ఈ–శ్రమ్ కార్మికులకు వరం

- సామాజిక భద్రత, సంక్షేమ పథకాల వర్తింపు
- పీఎంఎస్‌బీవై కింద రూ.2 లక్షల ప్రమాద బీమా
- సచివాలయాలు, ఆధార్ కేంద్రాల్లో ఉచితంగా నమోదు

చిత్తూరు కార్పొరేషన్: రెక్కల కష్టంతో జీవించే అసంఘటిత రంగాల కార్మికులకు అండగా నిలిచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ–శ్రమ్ పథకాన్ని ప్రవేశపెట్టాయి. జిల్లాలో భవన నిర్మాణ కార్మికులతో పాటు వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు దాదాపు 4,48,555 మందికి పైగా ఉంటే. అందరూ ఈ–శ్రమ్ పోర్టల్‌లో నమోదైనట్లు కార్మికశాఖాధికారులు చెబుతున్నారు. ఈశ్రమ్ కార్డు పొందితే లబ్ధి పొందేందుకు అవకాశం ఉందని అధికారులు తెలియజేస్తున్నారు.

నమోదుకు అర్హులు

సంఘటిత, అసంఘటిత రంగాలకు చెందిన దాదాపు 54 రకాల పనులు చేసే 16–59 ఏళ్ల వారు కార్మికశాఖ ద్వారా సాయం పొందేందుకు అర్హులు. చిన్న సన్నకారు రైతులు, ఉప్పు, పండ్ల విక్రేతలు, వీధి వర్తకులు, ఇటుకబట్టీలు, బ్రెడ్ కంపెనీ, సిరామిక్స్, హోటళ్లు, గ్యారేజీలు, బిల్డింగ్ వర్కర్లు, ఇండస్ట్రీస్, ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పనిచేసే ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులు, ఆస్పత్రులు, తదితర రంగాల్లో పనిచేసే రోజువారీ కూలీలు సాధారణ రిజిస్ట్రేషన్‌కు అర్హులు. ఆదాయపు పన్ను చెల్లించనివారు , ఈపీఎఫ్, ఈఎస్‌ఐ సదుపాయం లేనివారు, చిన్న సన్నకారు రైతులు, వ్యవసాయ అనుబంధ రంగాల కూలీలు, భవన నిర్మాణ కార్మికులు, చిరువ్యాపారులు, మత్స్యకార, నాయిబ్రాహ్మణ, చేనేత, రజక, డ్రైవర్, ఎలక్ట్రీషియన్స్ ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చు. మీ సేవ, గ్రామ వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి. ఆధార్, రేషన్‌కార్డు, బ్యాంకుఖాతా నెంబర్, రెండు పాస్ ఫొటోలతో దరఖాస్తును కార్మికశాఖ కార్యాలయంలో అందజేయాలి. అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేసి నిర్ధారించిన తర్వాత గుర్తింపు కార్డులను జారీచేస్తారు.

ఐదేళ్ల పాటు బీమా

అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక సంక్షేమ పథకాలు వర్తింపజేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ–శ్రమ్ పోర్టల్‌ను ప్రారంభించింది. ఆన్‌లైన్ విధానంపై అవగాహన ఉంటే సొంతంగానే తమ మొబైల్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఏడాది పాటు ఎలాంటి ప్రీమియం తీసుకోకుండానే ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన(పీఎంఎస్‌బీవై) కింద రూ.లక్ష ప్రమాద బీమా వర్తిస్తుంది. శాశ్వత అంగవైకల్యం, మృతికి రూ.2 లక్షలు, పాక్షిక వైకల్యానికి రూ.లక్ష బీమా పరిహారం నామినీకి అందజేస్తారు. దీంతో పాటు ఐదేళ్ల పాటు బీమా వర్తిస్తుంది.

జిల్లా సమాచారం

రంగం	సంఖ్య
వ్యవసాయం	2,90,839
నిర్మాణం	40,976
దుస్తుల దుకాణం	22,216
ఆటోమొబైల్స్/ట్రాన్స్‌పోర్ట్	18300
చేతివృత్తులు	9550
ఎలక్ట్రీషియన్/హార్డ్‌వేర్	6034
ఇంటి పనులు	5851
గూడ్స్, వస్తుతయారీ	5676
హెల్త్‌కేర్	5205
రిటైల్	4588
విద్య	3806
ఆఫీసులు	3594
టూరిజం	2290
ప్రొఫెషనల్	2244
లెదర్	2145
బ్యూటీ	1784
ఫుడ్	1454
పొగాకు	1147
సర్వీసు	1088
జ్యువెలరీ	911
ప్రింటింగ్	763
ప్రైవేటు సెక్యూరిటీ	501
చెక్కపని	239
టెక్‌టైల్స్/హ్యాండ్‌లూమ్	234
గ్లాస్/సిరామిక్	60
ఇతర రంగాలు	17060
మొత్తం	4,48,555

> **అవగాహన కల్పించాం**
>
> ఈ శ్రమ్ పోర్టల్‌లో కార్మికుల వివరాలు నమోదు, లబ్ధిపై ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా అవగాహన కల్పించాం. ఇతర సందేహాలు ఉంటే 14434 నంబరును సంప్రదించాలి. వీటిపై అన్ని రంగాల కార్మికులకు అవగాహన కల్పించి నమోదు చేయించాం. అత్యవసర సమయంలో ఆ పరిహారపు మొత్తం కార్మికుల కుటుంబాలకు చేదోడుగా ఉంటుంది.
>
> – ఓంకారరావు, సహాయ కార్మిక కమిషనర్, చిత్తూరు



ఇకపై రూరల్ మండలం

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు అర్బన్‌తోపాటు రూరల్ మండలం ఏర్పాటు కానుంది. జిల్లాల పునర్విభజన అనంతరం తిరుపతి జిల్లాలోకి 20, అన్నమయ్య జిల్లాలో 15 మండలాలు పోగా, 31 మండలాలు మాత్రం చిత్తూరుకు మిగిలాయి. ఈక్రమంలోనే ప్రస్తుతం చిత్తూరు అర్బన్, రూరల్ మండలాలను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం కేబినెట్‌లో ఆమోదం తెలిపింది. క్రమేణా పెరుగుతున్న జనాభా దృష్ట్యా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. చిత్తూరును రెండు మండలాలుగా చేస్తామని గత టీడీపీ పాలకులు హామీ ఇచ్చి నెరవేర్చలేకపోయారు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆ హామీని నెరవేర్చింది. ప్రస్తుతం చిత్తూరు పరిధిలో 17 గ్రామ పంచాయతీలు, గ్రామ సచివాలయాలు 9, వార్డు సచివాలయాలు 51, రెవెన్యూ గ్రామాలు 41 ఉన్నట్లు అధికారిక నివేదికలు వెల్లడిస్తున్నాయి. కొత్త మండలాలు ఏర్పాటుతో పరిపాలన సులభతరమవుతుంది.

డీఎస్సీ 1998 అభ్యర్థులకు పోస్టింగ్స్

ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న 1998 డీఎస్సీ అభ్యర్థులకు ప్రభుత్వం త్వరలో పోస్టింగ్‌లు ఇవ్వనుంది. ఇప్పటికే ఆ అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించిన విద్యాశాఖ అధికారులు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 611 మంది అభ్యర్థుల వివరాలను రాష్ట్ర విద్యాశాఖకు పంపారు. ప్రస్తుతం వారికి కేటాయించిన పోస్టుల భర్తీకి కేబినెట్ ఆమోదం తెలిపింది. త్వరలో వారికి విధి విధానాలను అనుసరించి పోస్టింగ్ ఇవ్వనున్నారు.

విద్యుత్ సరఫరా వేళల్లో మార్పు

చిత్తూరు కార్పొరేషన్: వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళల్లో మార్పులు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గురువారం నుంచి ఏ గ్రూప్ సర్వీసులకు ఉదయం 4 నుంచి మధ్యాహ్నం నుంచి 1 గంట వరకు, బీ గ్రూప్ సర్వీసులకు ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 6.30 వరకు సరఫరా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ మార్పును రైతులు గమనించాలని కోరారు.

తుంబకుప్పం పీహెచ్‌సీలో తనిఖీలు


తుంబకుప్పం పీహెచ్‌సీలో మందులను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

బంగారుపాళెం: మండలంలోని తుంబకుప్పం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఆస్పత్రిలో సిబ్బంది ముఖహాజరు వివరాలు నమోదు, రికార్డులను పరిశీలించారు. రోజుకు ఎంత మంది రోగులు పీహెచ్‌సీకి వస్తున్నారు. సరిపడే మందులు సరఫరా అవుతున్నాయా లేదా, కాలం తీరిన మందులేవైనా వినియోగిస్తున్నారా అనే విషయాలపై ఆరా తీశారు. ప్రభుత్వం నుంచి అందుతున్న ఆరోగ్య సేవలను సక్రమంగా అందిస్తున్నారా లేదా అని విచారణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శిరీష, సిబ్బంది పాల్గొన్నారు.

సైన్స్ అండ్ ఇంజినీరింగ్ ఫెయిర్‌కు ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో పాఠశాల సిబ్బంది

గంగవరం: సైన్స్ అండ్ ఇంజినీరింగ్ ఫెయిర్ ప్రాజెక్ట్ హైదరాబాద్‌లో నేటి నుంచి మూడు రోజుల పాటు జరిగే కార్యక్రమానికి గంగవరం మండలం నుంచి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. గంగవరం, కల్లుపల్లి జెడ్పీ హైస్కూల్స్ నుంచి 9వ తరగతి చదువుతున్న హర్షిత, నమిత, నవదీప్, రెడ్డెమ్మ నలుగురు విద్యార్థులు ఈ ప్రాజెక్ట్‌కు ఎంపికైనట్టు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పేర్కొన్నారు. నేటి నుంచి జరిగే ప్రాజెక్ట్‌లో పాల్గొనేందుకు ఈ నలుగురు విద్యార్థులు బుధవారం హైదరాబాద్‌కు బయల్దేరారు.

‘అమ్మ’ కడుపు నిండుగా!


పుత్తూరు ఆసుపత్రిలో పౌష్టికాహారం అందుకున్న గర్భిణులు


నగరి: పౌష్టికాహారం పంపిణీని ప్రారంభిస్తున్న రోజా(ఫైల్)

- పౌష్టికాహారం పంపిణీకి రోజా చారిటబుల్ ట్రస్ట్ శ్రీకారం
- వినూత్న కార్యక్రమానికి రెండేళ్లు పూర్తి
- హర్షం వ్యక్తం చేస్తున్న గర్భిణులు

పుత్తూరు రూరల్: అమ్మలు కాబోతున్న గర్భిణులు ఆకలితో అలమటించకుండా వారికి కడుపునిండా పౌష్టికాహారం అందిస్తున్న మంత్రి రోజాకు ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. పుత్తూరు వైద్య విధాన పరిషత్, నగరిలోని ఏరియా ఆస్పత్రికి ప్రతి బుధవారం పరీక్షల నిమిత్తం వచ్చే వందలాది మంది గర్భిణుల కండుపు నిండుగా పౌష్టికాహారం అందించే వినూత్న కార్యక్రమం ప్రారంభించి నేటితో రెండేళ్లు పూర్తయ్యాయి. పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి వచ్చే గర్భిణులు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. ఇలాంటి స్థితిలో సమయానికి వారు భోజనం లేక పస్తులుంటున్నారన్న విషయం ఎమ్మెల్యే రోజా దృష్టికి వచ్చింది. మహిళల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించే ఆమె వెంటనే స్పందించారు. వందల్లో వచ్చే గర్భిణుల ఆకలి తీర్చాలని నిర్ణయించుకున్నారు. ఆకలి అంటే ఏదో అన్నం పొట్లాలు ఇస్తే సరిపోతుందని అనుకోలేదు. అమ్మకు అమ్మతనం గుర్తొచ్చేలా పుట్టబోయే పాపాయి సైతం ఆరోగ్యంగా ఉండేలా వినూత్న సేవకు సంకల్పించారు. ఇందుకు అనుగుణంగా ప్రతి బుధవారం పుత్తూరు, నగరి ఆస్పత్రుల్లో పౌష్టికాహారం అందించే విధంగా కార్యాచరణ రూపొందించారు. 2021 ఫిబ్రవరి 3న పుత్తూరు ఆస్పత్రిలో ఆర్‌కే రోజా భర్త ఆర్కే సెల్వమణి చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆ తరువాత నగరి ఆస్పత్రిలో రోజా ప్రారంభించారు. రోజా చారిటబుల్ ట్రస్ట్ నిధులతో అప్పటి నుంచి నేటి వరకు క్రమం తప్పకుండా ప్రతి బుధవారం పుత్తూరు, నగరి ఆస్పత్రుల్లో సుమారు 500 మందికి పైగా గర్భిణులకు, వారికి సహాయకులుగా వచ్చే మరో 500 మందికి కలిపి మొత్తం 1000 మందికి పౌష్టికాహారం అందజేస్తున్నారు. పౌష్టికాహారంలో విజిటబుల్ ఫలావ్, గుడ్డు, వైట్ రైస్, కూరలు, పచ్చడి, సాంబారు, రసం, పెరుగన్నం, చిక్కీ, అరటిపండు అందిస్తున్నారు. క్రమం తప్పకుండా జరుగుతున్న ఈ కార్యక్రమం పట్ల గర్భిణులు సంతోషం వ్యక్తం చేస్తూ, మంత్రి రోజాకు రుణపడిఉన్నామని వేనోళ్ల కొనియాడుతున్నారు.

రోజా మంచి మనసుకు నిదర్శనం



సొంత ఖర్చుతో వందలాది మంది మాలాంటి గర్భిణులకు పౌష్టికాహారం అందించడం మంత్రి రోజా మంచి మనసుకు నిదర్శనం. ఆమె పలుకు ఎంత గట్టిగా ఉంటుందో...ఆమె మనస్సు అంత మెత్తనిది. ఆమె మహిళల పట్ల చూపుతున్న ఆదరణ వెలకట్టలేనిది. నాకు తొమ్మిదో నెల ప్రతి బుధవారం వస్తున్నాను. వచ్చిన ప్రతిసారీ మంచి భోజనం పెడుతున్నారు. – జి.లక్ష్మి, గేటుపుత్తూరు

అడక్కపోయినా రోజమ్మ పెడుతోంది



అడగందే అమ్మ అయినా పెట్టదంటారు, మరి అడక్కపోయినా మంత్రి రోజమ్మ పెడుతున్నారు. ఈమెది ఎంత మంచి మనో అర్థం చేసుకోవాలి? మా పాలిట అన్నపూర్ణమ్మ అంటాము. మాతోపాటు, పుట్టబోయే బిడ్డపట్ల ఆమె చూపుతున్న అభిమానం, ఆదరణ మాకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తోంది. నేను రెండో కాన్పు కోసం వస్తున్నాను. తొలి కాన్పు కూడా పుత్తూరు ఆస్పత్రిలోనే సుఖ ప్రసవం జరిగింది.
– పి.భాను, నెత్తం గ్రామం, పుత్తూరు మున్సిపాలిటీ



కుష్ఠు రహిత జిల్లాగా తిరుపతి

- ప్రారంభ దశలో గుర్తిస్తే నివారణ
- జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి శ్రీహరి


దుప్పట్లు పంపిణీ చేస్తున్న వైద్యాధికారులు

తిరుపతి తుడా : కుష్ఠు రహిత జిల్లాగా తిరుపతిని ఆవిష్కరించేందుకు చర్యలు ప్రారంభించినట్లు, వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందిస్తే అంగవైకల్యం నుంచి కాపాడవచ్చని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ శ్రీహరి పేర్కొన్నారు. నగరంలోని జ్యోతి లెప్రసీ కాలనీలో కుష్ఠు వ్యాధిపై అవగాహన, చికిత్స కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. దీనికి హాజరైన డీఎంహెచ్‌వో శ్రీహరి మాట్లాడుతూ బహుళ ఔషధ చికిత్సలతో వ్యాధి పూర్తిగా నయం అవుతుందన్నారు. ఈ వ్యాధి వంశపారంపర్యం కాదని తెలిపారు. కుష్ఠు వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా అవగాహన కార్యక్రమాలు, క్షేత్రస్థాయిలో చికిత్స అందించే చర్యలు జరుగుతున్నాయన్నారు. ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారన్నారు. స్పర్శ లేని మచ్చలను గుర్తించిన వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. అనంతరం 94 మంది బాధితులకు రిటైర్డ్ పీవోడీటీటీ డాక్టర్ హంసవర్ధిని దుప్పట్లు, స్నాక్స్ అందించారు. ఈ కార్యక్రమంలో కుష్ఠు, ఎయిడ్స్ అండ్ టీబీ నివారణ జిల్లా అధికారి డాక్టర్ అరుణ సులోచన, మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు హీనా, ఇతర వైద్యాధికారులు డాక్టర్ మధుబాబు, డాక్టర్ హేమంత్, ఫిజియోథెరపిస్ట్ రమణ, తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

కుప్పంరూరల్ : రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం పాలైన సంఘటన బుధవారం మల్లానూరు రైల్వేస్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ నాగరాజు కథనం మేరకు, సుమారు 30 ఏళ్ల వయసుండే గుర్తు తెలియని వ్యక్తి బెంగళూరు – చెన్నై రైల్వే మార్గంలో ఆవులనత్తం వద్ద ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి చెందిన విషయాన్ని స్థానికులు గుర్తించి సమాచారం ఇచ్చారని చెప్పారు. మృతి చెందిన వ్యక్తి కాషాయం రంగు కుర్తా, తెల్లటి ప్యాంటు ధరించి ఉన్నాడని చెప్పారు. మృతదేహాన్ని కుప్పం వందపడకల ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు నాగరాజు చెప్పారు.

చెట్టును ఢీకొన్న కారు: ఇద్దరికి గాయాలు


చెట్టును ఢీకొన్న కారు

రామకుప్పం: మండల పరిధిలోని రాజుపేట సమీపంలో చెట్టును కారు ఢీకొన్న సంఘటనలో ఇద్దరు గాయాలపాలయ్యారు. మండలంలోని మొద్దులవంక గ్రామానికి చెందిన నరేష్, కృష్ణరాజుపురానికి చెందిన అభి వ్యక్తిగత పనుల నిమిత్తం కారులో రాజుపేట రోడ్డుకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో కల్కి ఆశ్రమం వద్ద కారు అదుపు తప్పి చెట్టును ఢీకొంది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనం ద్వారా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

11 నుంచి జోయలుక్కాస్ ఎగ్జిబిషన్

పలమనేరు: పట్టణంలోని మదనపల్లె రోడ్డు ఎంబీఎస్ ఫంక్షన్‌హాలులో ఈనెల 11 నుంచి 13 వరకు జోయలుక్కాస్ జ్యువెలరీ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు ఆ సంస్థ ఎండీ జోయ్‌అలూకాస్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

క్రీడా పోటీల్లో దివ్యాంగ ఉద్యోగుల ప్రతిభ


టీటీడీ ఉద్యోగుల క్రీడాపోటీలు

తిరుపతి అలిపిరి: టీటీడీ ఉద్యోగుల క్రీడా పోటీల్లో బుధవారం జరిగిన పలు విభాగాల్లో దివ్యాంగ ఉద్యోగులు ప్రతిభ కనబరిచారు. చదరంగం పోటీల్లో బి.అరుణకుమారి విజేతగా నిలవగా, విజయలక్ష్మి రన్నరప్‌గా నిలిచారు. పాక్షిక అంధుల చెస్ పోటీల్లో రెడ్డెప్పరెడ్డి విజేతగా, డి.త్యాగరాజు రన్నరప్‌గా నిలిచారు. చెస్ పోటీల్లో రవికుమార్ విజేతగా, ఎంఏవీ సత్యం ద్వితీయ స్థానం పొందారు. క్యారమ్స్‌లో మునివెంకట ప్రసన్న విజేత కాగా ఎల్.కుమారి రన్నరప్‌గా నిలిచారు. పురుషుల క్యారమ్స్‌లో చంద్రశేఖర్ విజేత కాగా మధుసుదనశర్మ రెండో స్థానంలో నిలిచారు. క్యారమ్స్ డబుల్స్ పోటీల్లో చంద్రశేఖర్, శ్రీబాబు విజేతలుగా బి.శ్రీకాంత్, డి.శ్రీనివాసులు రన్నర్స్‌గా నిలిచారు. 45 ఏళ్లలోపు మహిళల పాసింగ్ ది లగేజ్ పోటీల్లో రమాదేవి జట్టు విజయం సాధించింది. ఎం.సునంద జట్టు రెండో స్థానంలో నిలిచింది.

మహిళను వేధించిన కేసులో రిమాండ్

తిరుపతి లీగల్ : ఓ మహిళను వేధించిన కేసులో వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల నగరిమిట్టకు చెందిన కావేటి ప్రసాద్ అలియాస్ నవీన్‌కు ఈనెల 22వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ తిరుపతి మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి పవన్‌కుమార్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. గత ఏడాది అక్టోబర్ 16వ తేదీన తిరుపతి ఎమ్మార్‌పల్లెలోని మహిళకు నిందితుడు పలుమార్లు ఫోన్ చేసి అసభ్యకరంగా మాట్లాడాడు. దీంతో పాటు అసభ్యకర ఫోటోలను ఆమె ఫోన్‌కు పంపడంతో ఆమె ఎస్వీయూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేసి నిందితుడు ప్రసాద్‌ను అరెస్టు చేశారు. బుధవారం సాయంత్రం న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు.

ఎర్రచందనం దుంగల స్వాధీనం


కృష్ణాపురం అటవీ ప్రాంతంలో స్వాధీనం చేసుకున్న దుంగలు

రేణిగుంట: రేణిగుంట, రైల్వే కోడూరు మండలాల్లో బుధవారం కూంబింగ్ ఆపరేషన్లలో 38 ఎర్రచందనం దుంగలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కర్నూల్ రేంజి డీఐజీ సెంథిల్‌కుమార్ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ ఎస్పీ చక్రవర్తి సూచనల మేరకు మంగళవారం రాత్రి రెండు బందాలుగా కూంబింగ్ నిర్వహించారు. మండలంలోని కృష్ణాపురం బీట్ పరిధిలో బుధవారం ఆర్‌ఎస్‌ఐ విశ్వనాథ్ బృందం కూంబింగ్ చేస్తుండగా శేషాచలం అడవి చీకలగుట్ట వద్ద కొందరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలు మోసుకొస్తూ కనిపించారు. పోలీసుల అలికిడిని గమనించి దుంగలను అక్కడే పడేసి పరారయ్యారు. అలాగే బాలపల్లె సెక్షన్ సిద్దిలేటి కోన కంగిమడుగు వద్ద ఎర్రచందనం మోసుకొస్తున్న కొందరు వ్యక్తులు కూంబింగ్ సిబ్బంది టార్చ్‌లైట్లు వేసుకు వస్తుండడాన్ని చూసి దుంగలను పడేసి పరారయ్యారు. అక్కడ మరో 16 దుంగలను స్వాధీనం చేసుకున్నారు. రెండు ఘటనల్లో పరారైన స్మగ్లర్ల కోసం గాలింపు చర్యలు చేపడుతున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ చంద్రశేఖర్, ఎస్‌ఐ మోహన్ తెలిపారు. కూంబింగ్‌లో పాల్గొన్న టాస్క్‌ఫోర్స్ బృంద సభ్యులను ఎస్పీ చక్రవర్తి అభినందించారు.